క్లుప్తంగా

నిత్యావసర వస్తువుల వితరణ



పిల్లలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: జీవకోనలోని సుభాష్ చంద్రబోస్ అనాథ శరణాలయంలోని పిల్లలకు గురువారం జేసీఐ ఆధ్వర్యంలో పిల్లలకు నిత్యావసర సరుకులు, వస్తువులను పంపిణీ చేశారు. అనాథ శరణాలయంలో జేసీఐ అలుమిని క్లబ్ సభ్యులు సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం చేతుల మీదుగా పిల్లలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, జోష్ ప్రాపర్టీస్ ప్రతినిధి డాక్టర్ ఈశ్వర్ ప్రకాష్, మెడికేర్ కేవీ.చౌదరి, జేసీఐ జోన్ చైర్మన్ జి.శంకరయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంజనీ కుమార్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈఈఈ విభాగపు పరిశోధక విద్యార్థి జి.వెంకట అంజనీ కుమార్‌కు ఎస్వీయూ డాక్టరేట్ ప్రకటించింది. ఆయన ప్రొఫెసర్ ఎం దామోదర్‌రెడ్డి పర్యవేక్షణలో 'పీవీ ఇంటిగ్రేటెడ్ ఎస్‌ఏపీఎఫ్ ఫర్ హార్మోనిక్ రిడక్షన్ ఇన్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్స్ యూజింగ్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

నేతాజీకి అదే నిజమైన నివాళి



సుభాష్ చంద్రబోస్‌కు నివాళులు అర్పిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: దేశాన్ని సమైక్యంగా ఉంచడం కోసం తన ప్రాణత్యాగం చేసిన మహనీయుడు సుభాష్ చంద్రబోస్ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా దేశ సమైక్యతకు పాటుపడడమే నేతాజీకి నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, నేతాజీ సుభాష్ ఫౌండేషన్ చైర్మన్ ఎస్.అజిత్ బాషా అన్నారు. గురువారం కాటన్ మిల్లు సమీపంలోని నేతాజీ విగ్రహం వద్ద ఆయన 129వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించి, ఆయన సేవలను కీర్తించారు. సీపీఎం నేతలు, జన విజ్ఞాన వేదిక నేతలు పాల్గొన్నారు.

25న ప్రాంగణ ఎంపికలు

తిరుపతి సిటీ: స్థానిక భవానీ నగర్‌లోని గేట్ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 నుంచి 2025లోపు ఏదేని డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని, ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 6281250110, 9441434786 నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

భారం కాదు..
బాలికలే భాగ్యవతులు

- ఆత్మవిశ్వాసాన్ని నింపే బాధ్యత తల్లిదండ్రులదే
- ఆడపిల్లల పురోభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమే
- నేడు జాతీయ బాలికల దినోత్సవం

ఒకప్పుడు ఎవరి ఇంట అయినా ఆడపిల్ల జన్మిస్తే మహాలక్ష్మి పుట్టిందని సంబరపడేవాళ్లు. తరాలు మారే కొద్దీ పురుషులకే పరిమితమైన రంగాల్లోనూ ఇప్పుడు మహిళలు అవకాశాలు అందిపుచ్చుకుని సత్తా చాటుతున్నారు. అయినను ఇప్పటికీ బాలికల పట్ల వివక్ష చూపుతున్నారనేది ఒక చేదు నిజం. చట్టాలు ఎన్ని తెచ్చినా..లింగ నిర్ధారణ పరీక్షల్లో ఆడపిల్ల అని తేలితే గుట్టుగా అబార్షన్లు చేసుకునే వారూ లేకపోలేదు. ఇది బైటపడని కోణం. కుటుంబాల్లో మగపిల్లలకు ఇచ్చినంత స్వేచ్ఛ ఆడపిల్లలకు ఇవ్వడం లేదు. దీనికి బోలెడన్ని కారణాలు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో బాలికల అభ్యున్నతికి ప్రత్యేక దృష్టి సారించింది.

తిరుపతి సిటీ: మహిళా– శిశు సంక్షేమ శాఖ 2008 నుంచి ప్రతి ఏటా జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై అవగాహన కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో.. బేటీ పడావో.. పథకాన్నీ అమలు చేస్తోంది. మరోవైపు బాలిక భారం కాదు... భాగ్యవతి అంటూ తల్లిదండ్రుల్లో ఆత్మవిశ్వాసం నింపి, అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రధానంగా ఉపాధ్యాయులపై ఉంటోందని మహిళా అధికారులు, అధ్యాపకులు చెబుతున్నారు.



తిరుపతి అవిలాలలోని ఓ పాఠశాలలో బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న మహిళా వర్సిటీ అధ్యాపకురాలు డాక్టర్ చైతన్య (ఫైల్)

బాల్యం నుంచే అవగాహన ముఖ్యం



తల్లిదండ్రులు ఆడపిల్లలకు బాల్యం నుంచే సమాజంపై అవగాహన కల్పించాలి. మన సంస్కృతిని తెలియజేస్తూ సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలను అవసరం మేరకు మాత్రమే వినియోగించేలా చూడాలి. మంచి-చెడుల మధ్య తారతమ్యాన్ని తెలియజేస్తూ అవి జీవితంపై ఎలా ప్రభావం చూపుతాయో చెప్పాలి. ఉపాధ్యాయులు విద్యతో పాటు బాలికలపై జరిగే అమానవీయ ఘటనలపై చైతన్య వంతులను చేయాల్సిన అవసరం ఉంది. ఇంటిలో ఆడపిల్ల పుట్టగానే ఏదో కోల్పోయినట్లు భావించే మనస్తత్వం నుంచి పేరెంట్స్ బయటపడాలి.

–డాక్టర్ టీ.నారాయణమ్మ, ప్రిన్సిపల్, పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల

బాలికల్లో రక్త హీనత సమస్య



దేశవ్యాప్తంగా 50 నుంచి 60 శాతానికి పైగా 15ఏళ్లలోపు బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని ఒక అధ్యయనంలో తేలింది. బాలికలు చదువు, ఆటలలో చురుకుగా ఉండే వయస్సులో పౌష్టిక సమతుల్యత అవసరం. తల్లిదండ్రులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మేధోశక్తి వృద్ధి చెందాలంటే ఆహారంలో పిండిపదార్థాలు, పండ్లు, మాంసకృత్తులు, ఐరన్ పుష్కలంగా లభించే ఆకుకూరలు, చిరుధాన్యాల ఆహారం పెట్టాలి.

–ప్రొఫెసర్ కేవీ సుచరిత, న్యూట్రీషియన్ విభాగం, ఎస్వీయూ

సమాజాన్నీ చదవాలి



ఆడపిల్ల పుట్టినా ఫర్వాలేదు అనే స్థితికి ఇప్పటి సమాజం ఉంటోంది. క్రమశిక్షణతో పాటు సమాజాన్ని చిన్నవయస్సులోనే చదివే స్థాయికి వారిని చేర్చే ప్రయత్నం చేయాలి. ఇది తల్లిదండ్రుల తప్ప వేరేవారు చేయలేరు. గ్రామీణ బాలికలు ఇప్పటికీ చాలావరకు కుటుంబ బాధ్యతలను మోస్తున్నారు. మరోవైపు బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం బాలికా సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. –రేవతి ప్రసాద్, గృహిణి, తిరుపతి రూరల్

డిజిటల్ జనరేషన్‌లో ఆత్మస్థైర్యం



డిజిటల్ జనరేషన్‌లో ఆడపిల్లల పెంపకంలో అత్యంత ప్రధానమైన అంశం బాలికలలో ఆత్మవిశ్వాసం నింపడం. పాఠశాల స్థాయి నుంచి టీచర్లు బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. గర్ల్‌చైల్డ్ హక్కులపై అవగాహన కల్పించాలి.

–డాక్టర్ వీ.సుమతి, ఏడీఆర్, ఆర్ఏఆర్ఎస్, తిరుపతి

అందరిపై అవగాహన బాధ్యత



ప్రస్తుత సమాజంలో బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోతోండటం ఆందోళన కలిగిస్తోంది. ఇంట్లో తల్లిదండ్రులు, స్కూళ్లలో టీచర్లు, పోలీసులు బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలి. గుడ్..బాడ్ టచ్‌పై అవగాహన ఎలా కల్పిస్తున్నారో అనుకోని విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు కూడా భయపడకుండా ఎలా ఎదుర్కోవాలో వారిని బలోపేతం చేయాలి.

–కే అన్నపూర్ణ, అడ్వొకేట్, తిరుపతి

అన్నింటా బాలికలదే పైచేయి



ఆడ, మగ అనే తేడా లేకుండా తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఒకేలా పెంచాలి. ప్రస్తుత సమాజంలో అన్నింటా బాలికలదే పైచేయి కనిపిస్తోంది. బాల్యం నుంచి విద్య, వస్త్రధారణ, ఇతర విషయాల్లోనూ ఆడపిల్లల విషయంలో వివక్ష కొనసాగుతోంది. దీనికి స్వస్తి పలికి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందిచాలి.

–ప్రొఫెసర్ తవిత తులసి, సోషల్‌వర్క్ విభాగాధిపతి, మహిళా వర్సిటీ

ప్రజా సమస్యలపై పోరాడుదాం



మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలనను తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా కలసికట్టుగా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసం వద్ద గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఇప్పటి వరకు ప్రజలకు చిన్నపాటి మేలు చేసిన పాపానపోలేదని విమర్శించారు. అధికార దాహంతో నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పిన ప్రజా ద్రోహి చంద్రబాబు అన్నారు. ప్రజల పక్షాన నిలబడి కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. అనంతరం పార్టీలో పదవులు పొందిన వారికి అభినందించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుయాదవ్, ఉదయ్ వంశీ, దినేష్‌రాయల్, మహ్మద్ ఖాసీమ్(చోటా), ఇ. తిరుమలరెడ్డి, చందురాయల్ తదితరులు పాల్గొన్నారు.

'రాళ్లపల్లి' కృషి మరువలేనిది



రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మకు పుష్పాంజలి ఘటిస్తున్న అతిథులు, టీటీడీ అధికారులు

తిరుపతి కల్చరల్: తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలను పరిష్కరించడంలో రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ చేసిన కృషి మరువలేనిదని ఆయన మనవరాలు, జాతీయ సంస్కృత వర్సిటీ ఆంగ్ల శాఖ విభాగాధిపతి ఆచార్య రాళ్లపల్లి దీప్తి ఉద్ఘాటించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో గురువారం రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ 133వ జయంత్యుత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. రాళ్లపల్లికి సంగీతం, సాహిత్యం రెండు కళ్లులాంటివని, అన్నమయ్య వారి సంకీర్తనలను రాగి రేకుల నుంచి పరిష్కరించి గ్రంథస్థం చేయడంతో పాటు వందల కృతులను స్వరపరిచారన్నారు. సదస్సులో గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్, ప్రముఖ శాసన పరిశోధకుడు తొండవాడకు చెందిన సొరకాయల కృష్ణారెడ్డి మాట్లాడారు. భారత, భాగవత, పురాణ ఇతిహాసాలను అపూర్వ సాహిత్యంతో సంకీర్తనలను రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ తెలుగు ప్రజానీకానికి అందించారని కీర్తించారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు రాజగోపాలరావు, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల, ఇతర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

• అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న కదిరి మంగళం సావిత్రి

తిరుపతి కల్చరల్: పవర్ ఎన్‌జీఓలో మహిళా సాధికారత కోసం కృషి చేసిన ఆ ఎన్‌జీఓ వ్యవస్థాపకులు కదిరి మంగళం సావిత్రి జాతీయ ఐక్యత అవార్డు అందుకున్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్సిటీలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వివిధ రంగాలలో సేవలందించిన వారికి అవార్డులు ప్రదానం చేశారు.

మఠం భవన నిర్మాణంపై నోటీసులు

తిరుమల: తిరుమలలో కర్ణాటకకు చెందిన బసవేశ్వర వీరశైవ విద్య వార్ధక సంఘ మఠం నిర్వాహకులకు టీటీడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. వారు నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, టీటీడీ 11.5 మీటర్ల ఎత్తువరకే అనుమతించగా.. మఠం 12.3 మీటర్ల ఎత్తువరకు నిర్మిస్తున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు.

పరామర్శలు.. పలకరింపులు





పనపాకంలో మునిరత్నం యాదవ్, దేవరకొండలో ఈశ్వరమ్మ చిత్రపటానికి చెవిరెడ్డి నివాళి

భాకరాపేట: చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, తిరుపతి రూరల్ మండలాల్లో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గురువారం పర్యటించారు. చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ అరిగిలవారిపల్లెలో వైఎస్సార్‌సీపీ నేత మణియాదవ్ తండ్రి మునిరత్నం యాదవ్ మరణించడంతో కర్మక్రియలకు హాజరై పుష్పాంజలి ఘటించారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ సర్పంచ్ విజయకుమార్ నానమ్మ మరణించడంతో ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే మట్లివారిపల్లెలో విశ్రాంత అధ్యాపకులు రాజారెడ్డి భార్య సంవత్సరీకంలో పాల్గొన్నారు. అనంతరం నాగేవాండ్లపల్లెలో వైస్సార్‌సీపీ నేత కొండారెడ్డి తల్లి అచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కోడెకంభంవారిపల్లెలో రఘునాథరెడ్డి ఆ కుటుంబ సభ్యులకు పరామర్శించారు. అలాగే పాలమాకులపల్లెకి చెందిన వెంకటస్వామి మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

జర్నలిస్టు కుటుంబ సభ్యులకు..

చిన్నగొట్టిగల్లు మండలం శాంతినగర్‌కు చెందిన ఓ దినపత్రిక విలేకరి హరి, చంద్రగిరి మండలం రెడ్డివారిపల్లెకు చెందిన ఓ టీవీ చానల్ రిపోర్టర్ శంకర్ కుటుంబ సభ్యులను కూడా చెవిరెడ్డి పరామర్శించారు. ఆ రిపోర్టర్ల తండ్రులు మరణించడంతో ఆయన సంతాపం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వైద్యులు



రుయాలో రక్తదానం చేస్తున్న వైద్యులు



స్విమ్స్‌లో రక్తదానం చేస్తున్న డాక్టర్ వనజాక్షమ్మ

తిరుపతి తుడా: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని రుయా, స్విమ్స్ ఆస్పతుల్లో రక్తదానం చేశారు. నేషనల్ మెడికో ఆర్గనైజేషన్ తిరుపతి యూనిట్ డాక్టర్ రవిశంకర్ ఆధ్వర్యంలో రుయా ఆసుపత్రిలో పేద రోగుల ఆపరేషన్ కోసం దాదాపు 30 మంది వైద్యులు, యూజీ, పీజీ వైద్య విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ రోజారమణి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరిబాబుయాదవ్, రుయా ఆస్పత్రి ఏఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ డాక్టర్ పరమేశ్వర్ బాబు, డాక్టర్ శరత్‌చంద్ర, బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ డాక్టర్ హరిత, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్స్‌లో..

స్విమ్స్ బ్లడ్‌బ్యాంక్ విభాగం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో వైద్యులు రక్తదానం చేశారు. కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వనజాక్షమ్మ సైతం రక్తదానం చేశారు. స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్ బాబు, 35మందికి పైగా వైద్యులు పాల్గొన్నారు

మంత్రి జన్మదిన వేడుకలు

పాకాల: స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి కేక్ కట్ చేశారు. పేదలకు పండ్లు, బ్రెడ్‌లు పంచారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య ఉన్నతికి సోపానం

ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాల వార్షికోత్సవంలో ఆర్‌ఐఓ ప్రభాకర్‌రెడ్డి



ప్రదీప్‌ను సత్కరిస్తున్న చక్రవర్తి రెడ్డి, ప్రిన్సిపల్ ఉష

తిరుపతి కల్చరల్: విలువలతో కూడిన విద్య ప్రతి విద్యార్థి ఉన్నతికి సోపానమని, ఆ దిశగా విద్యార్థుల భవితకు ఎస్‌డీహెచ్‌ఆర్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆర్‌ఐఓ జీవీ.ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం మహతి కళాక్షేత్రంలో ఎస్‌డీహెచ్‌ఆర్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌ఐఓ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, చదువుతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ డీవీఎస్. చక్రవర్తిరెడ్డి మాట్లాడుతూ, తల్లిదండ్రుల కలలు సాకారం చేసే దిశగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. అనంతరం సినీనటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రదీప్ కొండిపర్తి మాట్లాడారు. ఒత్తిళ్లకు గురికాకుండా పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడంలో మెలకువలను తెలియజేశారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జాతీయ స్థాయి నృత్య పోటీలలో బంగారు పతకం సాధించిన శివానిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ ఉష, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.